పారిశుధ్యంపై పట్టింపేది?

- నగరంలోని అంబేడ్కర్ కాలనీలో అధ్వానంగా పరిసరాలు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

నగరంలోని పలు కాలనీల్లో పారిశుధ్యం లోపించింది. అంబేడ్కర్ కాలనీలో కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై చెత్తాచెదారం పేరుకుపోయింది. అలాగే డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించకపోవడంతో మురుగునీరు పారకం నిలిచిపోయి, దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అంబేడ్కర్ కాలనీలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు.. రోడ్డుపైకి వచ్చిన చెత్తాచెదారం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): నగరంలోని అంబేడ్కర్ కాలనీలో పారిశుధ్యం అటకెక్కింది. కార్పొరేషన్ అధికారులుఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీలోని పరిసరాలు అధ్వానంగా మారాయి. పలు వీధుల్లో చెత్త డబ్బాలు లేకపోవడంతో చౌరస్తాలు చెత్తమయంగా మారాయి. మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది రోజువారీగా చెత్తను తొలగించడం లేదు. దీంతో చెత్తాచెదారం రోడ్డుపైకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కాలనీలో ఉన్న పెద్ద డ్రైనేజీకాలువలో చెత్త పేరుకుపోతుంది. దీంతో మురికినీరు కిందికి వెళ్లడం లేదు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా సీసీ డ్రెయినేజీ కాలువ అక్కడక్కడా కూరుకుపోగా, దీనికి మరమ్మతులు చేయడం లేదు. తద్వారా వాహనదారులు, చిన్న పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపర్చాలని, చెత్త వేయడానికి డబ్బాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రెయినేజీని శుభ్రం చేయడం లేదు..



అంబేడ్కర్ కాలనీలో చెత్త డబ్బాలు లేకపోవడంతో రోడ్లపై చెత్తను వేయాల్సి వస్తోంది. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తీయడం లేదు. వీధుల్లోంచి వస్తున్న వ్యర్థాలు డ్రెయినేజీ కాలువలో పడుతోంది. తద్వారా మురికినీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. కాలువను కూడా శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతోంది. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలి.

–దయానంద్, కాలనీవాసి

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- పంటలను తెగుళ్లు ఆశించే అవకాశం
- రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్తలు

రుద్రూర్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వచ్చే ఐదు రోజుల్లో పొడి వాతావరణం నమోదవుతుందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలు 38.7నుంచి 40.3 డిగ్రీల సెల్సియస్, రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు 23.8 నుంచి 25.1 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని వివరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వరిలో మెడ విరుపు తెగులు తీవ్రత పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు మాంకోజేబ్ +ట్రైసైక్లజోల్ 2.5గ్రా.(లేదా)పికాక్సిస్ట్రోబిన్+ట్రైసైక్లజోల్ 2మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. దీని నివారణకు 0.2 గ్రా.ల థయోమిథాక్సం లేదా 0.2 గ్రా.ల అసిటామిప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.


వరిలో మెడ విరుపు తెగులు

నీరు పెట్టాలి

కూరగాయ, పండ్ల తోటల్లో నీటి తడులు పెట్టుకోవాలి. నీటి తడులను ఉదయం, సాయంత్రం వేళల్లో పెట్టాలి. పండ్ల తోటల్లో నేలలో ఉన్నటువంటి తేమను సంరక్షించుకోవడానికి నేలపై పంట అవశేషాలు, ఎండు గడ్డి లేదా పాలిథిన్ షీట్‌లను కప్పి ఉంచాలి. పశువులకు దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడంతో బలహీన పడకుండా కాపాడవచ్చు. కోళ్ల వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి షెడ్లలో ఫ్యాన్లను, ఫాగర్స్‌ను అమర్చి షెడ్లపై వరి గడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి.

డిచ్‌పల్లిలో ఫ్లెక్సీల కలకలం




డిచ్‌పల్లి మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలతో వెలసిన ఫ్లెక్సీలు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పరోక్షంగా ఫ్లెక్సీల వార్ నడుస్తోంది. శుక్రవారం ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి తేలేకపోయారని గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేకపోయిన వాటిపై సెటైర్‌గా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. ఈ ఫ్లెక్సీల్లో 'చెప్పినట్టు 100 రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని రీఓపెన్ చేయించి మా నాన్న, అన్నలతో సెల్ఫీ..' అంటూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తూ వేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. అలాగే నెలకు రూ.3,016 లు నిరుద్యోగ భృతి ఇదిగో, రూ.500 కోట్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ సెల్ ఇది అంటూ వేసిన ఫ్లెక్సీలను ప్రజలు ఆసక్తిగా గమనించారు.

ఇందల్వాయి: ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. హైవే ఫ్లై ఓవర్‌కు వేలాడదీసిన నాలుగు ఫ్లెక్సీల్లో నిరుద్యోగ భృతి, వంద రోజుల్లో చక్కెర ఫ్యాక్టరి ప్రారంభం, 500 కోట్లతో ఎన్ఆర్ఐ సెల్ ఏర్పాటు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీలను హేళన చేస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ విషయంపై బీజేపీ నాయకులను సంప్రదించగా ఫ్లెక్సీలకు తమకు ఏమి సంబంధం లేదని తెలపడం గమనార్హం.


ఇందల్వాయి మండలకేంద్రంలో..

రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు.. సిరికొండ మండల కేంద్రంలో..


మోపాల్ మండల కేంద్రంలో..

డిచ్‌పల్లి/సిరికొండ/ధర్పల్లి/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి/మోపాల్(నిజామాబాద్‌రూరల్)/ఖలీల్‌వాడి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదని, ఇదీ ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యే అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాలోని అన్ని మండలాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు విలేకర్ల సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సమగ్రత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి జీర్ణించుకోలేక ప్రధాని మోదీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని ఆరోపించారు. ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దేశంతో పాటు పేద ప్రజల సొమ్మును దోచుకుంటున్న అదానీ, అంబానీలకు అండగా మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని విమర్శించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా నగరంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. డీసీసీ డెలిగేట్‌లు ధర్మాగౌడ్, వాసుబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నాగేష్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, శేఖర్ గౌడ్, వెల్మ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నగరంలో నిరసన తెలుపుతున్న నాయకులు


ఇందల్వాయి మండల కేంద్రంలో..


జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో..


ధర్పల్లి మండల కేంద్రంలో..

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డిచ్‌పల్లి: ఈ నెల 3నుంచి 13వరకు జరగబోయే పదో తరగతి పరీక్షల నిర్వహణకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాజగంగారాం శనివారం తెలిపారు. మండలంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 1353 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి పరీక్ష సమయం కంటే గంట ముందు చేరుకునే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని ఆయన విన్నవించారు.

ఉపవాసంతో షుగర్ వ్యాధి తగ్గుదల

నిజామాబాద్ సిటీ: ఉపవాసాలతో షుగర్ వ్యాధిని తగ్గించవచ్చని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ జలగం తిరుపతిరావు తెలిపారు. కరీంనగర్‌లో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి డయాబెటిస్ సదస్సులో తిరుపతిరావు పాల్గొని, మాట్లాడారు. ఉపవాసాలతో డయాబెటీస్‌ను ఎలా తగ్గించాలి అనే అంశంపై ప్రసంగించారు. డయాబెటీస్‌ను మందులు వాడకుండా ఎలా తగ్గించాలో శాస్త్రీయపరంగా వివరించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	59,200	వెండి (కిలో)	71,200
22 క్యారెట్స్	54,800		- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	50	70
బెండకాయ	40	60	గాజరుగడ్డ	15	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	30	50	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	40	60	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	25	50	గోబిపువ్వు	20	40
పాలకూర	25	50	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	25	50	చిక్కుడుకాయ	60	80
పుదీనా	30	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1- దసరా - 10.20, 1.30, 4.10, 7.30, 10.30
స్క్రీన్-2- డంజియన్స్ అండ్ డ్రాగన్స్ (ఇంగ్లిష్) 10.30, 7.30
భోలా (హిందీ-3డీ) - 1.35
దాస్ కా దమ్కీ -4.30, 10.40
స్క్రీన్-3- భోలా (హిందీ-3డీ) - 10.20, 7.45, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- భోలా (హిందీ-3డీ) - 12.30, 3.40, 7.30, 10.40
స్క్రీన్-2 - జాన్‌విక్ చాప్టర్-4 (ఇంగ్లిష్) - 12.20
దసరా - 3.50, 7.15, 10.30
స్క్రీన్-3- దాస్ కా దమ్కీ -12.00
జాన్‌విక్ చాప్టర్-4 (ఇంగ్లిష్) - 3.10, 6.40, 10.10
స్క్రీన్-4- డంజియన్స్ అండ్ డ్రాగన్స్ (ఇంగ్లిష్) 1.15, 10.20
పరారీ - 4.10 దాస్ కా దమ్కీ - 7.10

దేవి - దాస్ కా దమ్కీ
నటరాజ్ - భోలా (హిందీ-3డీ)
లలితామహల్ - దసరా
విజయ్ - బలగం

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

నిజామాబాద్‌నాగారం: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు బాధితులకు అండగా ఉంటాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పలు బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం మొదటి కర్తవ్యమన్నారు. నగర ప్రజలు అత్యవసర సమయాల్లో ప్రయివేటు హాస్పటల్‌లో చికిత్స పొందితే సంబంధిత బిల్లులతో మా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌గుప్తా

నగరంలో పోషణపక్షం



నిజామాబాద్ సిటీ: నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో శనివారం జిల్లా మహిళా, శిశు వికలాంగుల, సీనియర్ సిటిజెన్ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, సభ్యురాలు సూదం లక్ష్మి, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రాలు ముఖ్య అతిథులుగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ, ఇన్‌చార్జి మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి సుధారాణి, ప్రాజెక్ట్ అధికారి మెప్మా రాములు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి

నందిపేట(ఆర్మూర్): పోటీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారంలో టీఎస్పీఎస్సీ చైర్మన్ నైతిక బాధ్యత వహిస్తూ విధుల నుంచి తొలగించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నందిపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్లు లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ రోజుకొక మాట మాట్లాడుతూ సమస్యను పక్కదారి పట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో గల శ్రీమహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శ్యామ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నడిపల్లి సర్పంచ్ కులాచారి సతీష్‌రావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..



సిరికొండ: మండల కేంద్రంలోని శేషసాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు శనివారం వైభవంగా కొనసాగుతున్నాయి. అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞం నిర్వహించారు. ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సరస్వతీమాతను దర్శించుకున్న మేయర్

నిజామాబాద్‌నాగారం: నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ శనివారం బాసర సరస్వతిదేవిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ విలాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్యామ్, ఆలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.



సీఎం హామీలను నెరవేర్చాలి



నిజామాబాద్‌నాగారం: బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అవినీతి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఫ్లెక్సీల రాజకీయానికి తెరలేపారని పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎంపీ అర్వింద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు కనీస అవగాహన లేకుండా ఫ్లెక్సీలు పెట్టడం సిగ్గుచేటన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ 100 రోజుల్లో ఓపెన్ చేస్తామని చెప్పి, 3000 రోజులు గడిచిన ఇంతవరకు దాని ఊసే లేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తామని, రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో 'బలగం'ను ప్రదర్శించొద్దు

సిరికొండ: ఇటీవల విడుదలైన బలగం సినిమాను బహిరంగ ప్రదేశాల్లో, ఫంక్షన్‌హాళ్లలో ప్రదర్శించరాదని ఎస్సై నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. సినిమాను బహిరంగంగా ప్రదర్శించడం చట్టరీత్యా నేరం అని, నిబంధనలు ఉల్లంఘించి ప్రదర్శించినట్లయితే ప్రైవసీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

పెండింగ్ రుణాలను విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. దళితబంధును అడ్డంపెట్టి ఎస్సీ కార్పొరేషన్ రుణాలను ఇవ్వడం లేదని. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ బాలకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు కెప్టెన్ రాజు, గణపతి భరత్ పాల్గొన్నారు

గిరిరాజ్ కళాశాలలో జాబ్ మేళా

నిజామాబాద్ అర్బన్: నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 20 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 2261మంది విద్యార్థులు మేళాకు హాజరవ్వగా.. 45 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. మరో 20052 మంది విద్యార్థులు రెండోదశ సెలక్షన్ ఎంపికలో ఉన్నారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ నిర్వాకులు శౌర్య. శేఖర్ పాల్గొన్నారు

ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభం



సుభాష్‌నగర్: నగరశివారులోని బోర్గాం(పి)లో ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థను శనివారం ప్రారంభించారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా దండు శ్రీకాంత్ కుర్మ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతిని ప్రగతిపథంలో నడిపించడం కోసం సంస్థను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు విద్యార్థులకు పండ్లు పంపిణీచేశారు. అనంతరం సంస్థ పోస్టర్లు ఆవిష్కరించారు. సంస్థ ప్రతినిధులు మైత్రి రాజశేఖర్, దండు హరీష్, వర్షిత, ఘనపురం దేవేందర్, గోపాల్, స్పందన, సంధ్య, నగ్మా, సంధ్య శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సీపీకి సన్మానం



సుభాష్‌నగర్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజును టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈసందర్భంగా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్, నాయకులు చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, శేఖర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నగరంలోని ఎన్ఆర్‌భవన్‌లో ఆదివారం నిర్వహిస్తున్నామని, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, నాయకులు తదితరులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం సర్పంచ్ గాదారి నర్సారెడ్డి పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాన్సువాడ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com